# సాక్షి
# అనకాపల్లి

మంగళవారం : 25 : జూన్ : 2024






**సత్వర పరిష్కారం** 8లో

కలెక్టరేట్‌లో పబ్లిక్ గ్రీవెన్స్ మళ్లీ ప్రారంభించారు. కలెక్టర్. జేసీ తదితర జిల్లా అధికారులు 161 అర్జీలు స్వీకరించారు.



**మహిళను కాపాడిన లైఫ్‌గార్డ్స్**

విశాఖ: ఆర్కేబీచ్‌లో కొట్టుకుపోతున్న మహిళను లైఫ్‌గార్డ్స్ రక్షించారు. భార్యాభర్తలు స్నానానికి దిగగా ఈ ఘటన జరిగింది.

**వాతావరణం**

గరిష్ఠం/కనిష్ఠం 35.8/25.5

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశముందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి చెప్పారు.

## న్యూస్‌రీల్

### పట్టుదలతో చదివితే లక్ష్య సాధన

- ఉత్తరప్రదేశ్ అడిషినల్ డీజీపీ సత్యనారాయణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉత్తరప్రదేశ్ అడిషినల్ డీజీపీ సత్యనారాయణ

**కోటవురట్ల:** మట్టిలో మాణిక్యాలు బుర్రకు పదును పెట్టాలని, పట్టుదలతో చదివితే సాధించలేనిది ఏదీ ఉండదని ఉత్తరప్రదేశ్‌లో అడిషినల్ డీజీపీగా పనిచేస్తున్న కిల్లాడ సత్యనారాయణ అన్నారు. మండలంలోని పాములవాకకు చెందిన ఆయన తన స్వగ్రామంలోని ప్రభుత్వ స్కూలులో చదివి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు అదే పాఠశాలకు వచ్చి చైతన్యం కలిగిస్తుంటారు. ఇటీవల తన స్వగ్రామం రావడంతో జెడ్పీ హైస్కూల్‌ను సోమవారం సందర్శించారు. విద్యార్థులతో సమావేశమై వారికి మోటివేషన్ చేశారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలగా చదివితే కచ్చితంగా సాధించవచ్చన్నారు. విద్యార్థి దశ చాలా కీలమని, చిన్నతనం నుంచి క్రమశిక్షణ అలవరుచుకుని బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.వి.లక్ష్మీనారాయణ, పీడీ వి.అచ్యుతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఆరోగ్య మిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గోవింద్



**అనకాపల్లి:** రాష్ట్ర ఆరోగ్య మిత్ర ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడిగా చవ్వాకుల గోవింద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాకవరపాలెం మండలానికి చెందిన ఆయన్ను ఆదివారం విజయవాడలో జరిగిన నూతన రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వై.ఎస్.భద్రం సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మాకవరపాలెం ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న గోవింద్‌కు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలోని ఆరోగ్యమిత్రలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం, రోగులకు నాణ్యమైన వైద్యం అందించడం, న్యాయమైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని నూతన కమిటీని కోరారు.

### కేజీహెచ్ గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పద్మావతి

**మహారాణిపేట (విశాఖ):** కేజీహెచ్ గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా సీహెచ్ పద్మావతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో గ్రేడ్ -2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన పద్మావతికి కేజీహెచ్‌కు పదోన్నతిపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేజీహెచ్ నర్సింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేయడంతో పాటు హెడ్ నర్స్, స్టాఫ్ నర్స్‌లను, కాంట్రాక్ట్ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు. పలువురు హెడ్‌నర్స్‌లు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది పద్మావతికి అభినందనలు తెలిపారు.

### ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

**డాబాగార్డెన్స్ (విశాఖ):** దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా ఆ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేసిన నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్(జోన్-1 ఆపరేషన్స్) బి.అప్పలనాయుడు తెలిపారు. జోన్-1 పరిధి ద్వారకా బస్ స్టేషన్ నుంచి 12 ప్రత్యేక సర్వీసులు, అలాగే శ్రీకాకుళం, విజయనగరం నుంచి మరో 3 ప్రత్యేక సర్వీసులు విజయవాడకు నడపనున్నట్లు పేర్కొన్నారు. అలాగే వందే భారత్ రైలు ప్రయాణికుల కోసం విశాఖపట్నం నుంచి విజయనగరానికి రాత్రి వేళల్లో ప్రత్యేక సర్వీసు ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు.

### యథావిధిగా జన్మభూమి ఎక్స్‌ప్రెస్

**తాటిచెట్లపాలెం (విశాఖ):** విశాఖపట్నం-లింగంపల్లి-విశాఖపట్నం మధ్య నడిచే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ యథావిధిగా కొనసాగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ప్రకటనలో తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో జరుగుతున్న పలు భద్రతాపరమైన, ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖపట్నం-లింగంపల్లి(12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 26వ తేదీ నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు, లింగంపల్లి-విశాఖపట్నం(12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 27వ తేదీ నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు గతంలో ప్రకటించారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ రైలు యథావిధిగా నడుస్తుందని, ప్రయాణికులు మార్పును గమనించాలని కోరారు.

## జిల్లాకు జ్వరమొచ్చింది





**సాక్షి న్యూస్ నెట్‌వర్క్:** వాతావరణం ఎండల నుంచి వర్షాల వైపు మరలుతోంది. కొద్ది రోజులుగా వానలు కురుస్తున్నాయి. వాతావరణ మార్పులతో జిల్లాలో పలుచోట్ల సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా జ్వరబాధితులు ఎక్కువయ్యారు. ముఖ్యంగా మారుమూల గ్రామాలు మంచం పట్టాయి. రోలుగుంట, గొలుగొండ, మాడుగుల వంటి గిరిజన గ్రామాలు ఉన్న మండలాల్లో మలేరియా పొంచి ఉంది. ఇవి కొండ ప్రాంతాలకు అనుకొని ఉండటం వలన దోమల బాధ ఎక్కువ. వీటి వల్ల జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయింది. ఎంపీడీవోలు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, వైద్యాధికారులతో సమావేశమై సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. ప్రతీ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులతో పాటు మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ పనులు చేయాలని ఆదేశిస్తున్నారు. వైద్య సిబ్బంది పలు గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి, జ్వరపీడితులకు వైద్యసేవలందిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ సిబ్బంది మంచినీటి ట్యాంకులను పెద్ద ఎత్తున శుభ్రం చేస్తూ.. పారిశుధ్య పనులు చేపడుతున్నారు.

## వైద్య శిబిరాలతో ఊరట

- ఇంటింటికీ తిరిగి బాధితుల వివరాలు సేకరించిన వైద్య బృందం
- పర్యవేక్షించిన ఉన్నతాధికారులు
- అర్లలో మూడు రోజులపాటు కొనసాగనున్న శిబిరం



ఆరోగ్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

**రోలుగుంట:** జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉన్న అటవీ గ్రామం అర్లలో వైద్యాధికారులు సోమవారం మెగా ఆరోగ్య శిబిరం నిర్వహించారు. బుచ్చింపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీనివాసరాజు నేతృత్వంలో వైద్య సిబ్బంది బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి బాధితులను గుర్తించారు. శిబిరానికి వచ్చిన రోగులకు రోగ నిర్ధారణ పరీక్షలు చేశారు. వీరిలో ఇద్దరికి మలేరియా, ఇద్దరికి సుగర్, ఇద్దరికి బీపీ సమస్యలున్నాయని, మిగిలిన వారు జ్వరాలతో బాధ పడుతున్నట్టు తేలింది. రోగులందరికీ అవసరమైన మందులు అందజేసి, ఆరోగ్య జాగ్రత్తల గురించి వివరించారు. హెల్త్ అసిస్టెంట్ హరిబాబు, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, ఆశా బృందంగా ఏర్పాటై ఇంటింటా తిరిగి రోగుల వివరాలు నమోదు చేసుకున్నారు. శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలు పరిశీలించారు. రోగులను కలిసి అనారోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న కారణంగా తాగునీరు కలుషితమై రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఇది ఏజెన్సీ ప్రాంతం కావడంతో దోమలు ఎక్కువగా ఉంటాయని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో దోమతెరలు వాడాలన్నారు. మరగ కాచిన వేడినీటిని మాత్రమే తాగాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లా మలేరియాధికారి కె.వరహాలు దొర గ్రామానికి వచ్చి ఇక్కడ పరిస్థితులు తెలుసుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందిని వాటర్ ట్యాంకు వద్దకు తీసుకెళ్లి క్లోరినేషన్ చేయించారు. తాగునీటి బోర్లు, బావులు, వాటర్ ట్యాంకుల వద్ద పరిశుభ్ర వాతావరణం ఉండాలని, నీటి నిల్వలు లేకుండా నివారించాలన్నారు. పారిశుధ్య పనులు మెరుగుపరచి వీధి కాలువల్లో, గృహాల ఆవరణలో పారిశుధ్య కార్మికులతో బ్లీచింగ్ చల్లించాలని ఆదేశించారు. గ్రామంలో మూడు రోజులపాటు వైద్య శిబిరం కొనసాగుతుందని డీఎంహెచ్‌వో వీరజ్యోతి చెప్పారు. ఈవోపీఆర్డీవో ఎస్.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంకులో క్లోరినేషన్ చేయిస్తున్న జిల్లా మలేరియాధికారి వరహాలుదొర



ఇంటింటికీ వెళ్లి రోగుల సమస్య తెలుసుకుంటున్న వైద్య సిబ్బంది

## ప్రజా రవాణా వాడుదాం.. కాలుష్యాన్ని నియంత్రిద్దాం



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి



బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

**డాబాగార్డెన్స్ (విశాఖ):** వారంలో ఒక్క రోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకట కుమారి పేర్కొన్నారు. ఆమె తమ క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ కార్యాలయానికి ప్రజా రవాణా ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో చేరుకోగా.. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో విపరీతంగా పెరిగిపోతున్న కాలుష్య నియంత్రణకు వారంలో ఒకరోజు జీవీఎంసీ ఉద్యోగులతోపాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒక రోజు ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.

## గిరిప్రదక్షిణకు భారీ ఏర్పాట్లు

- వచ్చేనెల 20 ఘనంగా నిర్వహణ
- అన్నిశాఖలతో సమన్వయం
- కొండచుట్టూ 30 స్టాళ్ల ఏర్పాటు
- దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి



దేవస్థానం వైదికులు, ఇంజినీరింగ్ అధికారులు, సెక్షన్ హెడ్‌లతో సమీక్ష నిర్వహిస్తున్న ఈవో

**సింహాచలం :** వచ్చేనెల 20న గిరి ప్రదక్షిణను వైభవంగా నిర్వహించేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. గిరిప్రదక్షిణ ఏర్పాట్లపై దేవస్థానం వైదికులు, ఇంజినీరింగ్ అధికారులు, పలు విభాగాల అధిపతులతో సోమవారం ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ గిరి ప్రదక్షిణకు లక్షలాది మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని, ప్రధానంగా నగరంలో 32 కిలోమీటర్ల మేర జరిగే ఉత్సవం కావడంతో అన్నిశాఖల సమన్వయంతో ముందుకు వెళతామన్నారు. జీవీఎంసీ, పోలీస్, మెడికల్ తదితరశాఖల అధికారులకు లేఖలు రాయాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. అలాగే దాతలు, స్వచ్ఛంధ సంస్థలతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. 20వ తేదీన సాయంత్రం 4గంటలకు కొండదిగువన తొలిపావంచా వద్ద నుంచి పుష్పరథం ప్రారంభమవుతుందని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం గిరి ప్రదక్షిణ జరిగే పరిధిలో కొండచుట్టూ 30 స్టాళ్లను ఏర్పాటు చేస్తామని , 275 మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో అన్నిశాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేవస్థానం స్థానాచార్యులు టీపీ రాజగోపాల్, ఇంజినీరింగ్ అధికారులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

**జూలై 20, 21 తేదీల్లో ఆర్జిత సేవలు రద్దు**

గిరిప్రదక్షిణ సందర్భంగా జూలై 20, 21వ తేదీల్లో ఆర్జితసేవలన్నీ రద్దు చేస్తున్నట్టు దేవస్థానం స్థానాచార్యులు టీపీ రాజగోపాల్ తెలిపారు. అలాగే దర్శనాల సమయాల్లో కూడా మార్పులు ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా 20న ఉదయం గిరి ప్రదక్షిణ ప్రారంభించి రాత్రికే తిరిగి సింహాచలం చేరుకునే భక్తుల సౌకర్యార్థం ఆరోజు రాత్రి 10గంటల వరకు దర్శనాలు అందజేస్తామని తెలిపారు. అలాగే 21వ తేదీ తెల్లవారుజాము నుంచి సాయంత్రం 4గంటల వరకు దర్శనాలు ఉంటాయని తెలిపారు.

## ప్రైవేటు వల!

- విద్యార్థులను ఎగరేసుకుపోతున్న యాజమాన్యాలు
- ప్రభుత్వ స్కూలు పిల్లలకు గాలం
- లక్ష్యానికి ఆమడ దూరంలో అడ్మిషన్లు
- నామమాత్రంగానే 'నేనూ బడికి పోతా'
- 'విద్యా ప్రవేశ్‌'తోనైనా అడ్డుకట్ట పడేనా..

### సర్కారు బడులు విలవిల







రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో విద్యార్థుల ప్రవేశాలు పొందే పాఠశాలగా విశాఖలోని చంద్రపాలెం జెడ్పీ హైస్కూల్‌కు పేరుంది. ఏటా ఇక్కడ వెయ్యి మందికి పైగా కొత్తగా ప్రవేశాలు పొందుతారు. కానీ ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు 600 మంది వరకు చేరారు. ఇంకా చేరే అవకాశం ఉన్నప్పటికీ గత ఏడాది వరకు అయితే పాఠశాలల తెరిచిన తొలినాళ్లలోనే చంద్రంపాలెం హైస్కూల్లో సీటు కోసమని విద్యార్థుల నుంచి భారీగా డిమాండ్ ఉండేది. కానీ ఈ ఏడాది పరిస్థితి మరోలా ఉంది.

విశాఖలోని మధురానగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గతేడాది 75 మంది విద్యార్థులు కొత్తగా చేరారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 26 మంది మాత్రమే ప్రవేశం పొందారు. వివిధ తరగతులకు చెందిన మరో 20 మంది విద్యార్థులు టీసీలు తీసుకొని ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లిపోయారు. గత 12 ఏళ్లలో ఈ సమయానికి ఇంత తక్కువ అడ్మిషన్లు అయిన సందర్భం లేదని పాఠశాల ఉపాధ్యాయులు చెబుతున్నారు. గతేడాది లక్ష్యం చేరుకోవటం ఈ సారి కష్టమేనని అంటున్నారు.

**ఈ ఏడాది జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పరిస్థితి ఇలా ఉంది. మరోపక్క ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాల జోష్ కనిపిస్తోంది.**

**విశాఖ విద్య :** జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు భారీగా తగ్గిపోతున్నాయి. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమై పన్నెండు రోజులు అవుతున్నా.. ఆశించిన స్థాయిలో ప్రవేశాలు నమోదు కాకపోవటంతో ఉపాధ్యాయులు తర్జన భర్జన పడుతున్నారు. 2023-24 విద్యా సంవత్సరం గణాంకాల మేరకు జిల్లాలో 1,389 మంది పాఠశాలలు ఉండగా వీటిలో 3,91,736 మంది విద్యనభ్యసించారు. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 608 వరకు పాఠశాలలు ఉండగా వీటిలో 90,866 మంది చదువుకున్నారు. అలాగే ఎయిడెడ్ స్కూళ్లలో 4,884 మంది విద్యనభ్యసించారు. 781 ప్రైవేట్ పాఠశాలల్లో మిగతా విద్యార్థులు ఉన్నారు. 2023-24 విద్యా సంవత్సరం లక్ష్యానికి మించి ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని స్కూళ్లలో అడ్మిషన్లు చేపట్టాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్దేశించారు. కానీ బడులు తెరిచి పన్నెండు రోజులు కావస్తున్నా.. అడ్మిషన్ల ప్రక్రియ లక్ష్యానికి ఆమడ దూరంలో ఉండటం విద్యాశాఖ వర్గాల్లో ఒకింత ఆలోచన మొదలైంది.





విశాఖ వ్యాలీ స్కూల్ ముందు హౌస్ ఫుల్‌బోర్డు

**ఈ తిరోగమనం ఎందుకంటే?**

ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెంచేందుకు 'నేనూ బడికి పోతా' అనే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు. బడిఈడు పిల్లలందరిని పాఠశాలల్లో చేర్పించాలనేది దీని లక్ష్యం. కానీ ఆశించిన ఫలితాలు కానరావటం లేదు. జిల్లాలోని చాలా వరకు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు వేసవిలోనే ముందస్తు అడ్మిషన్లు చేపట్టాయి. కూటమి ప్రభుత్వంలో కుటుంబంలో ఎంతమంది చదువుకుంటే అందరికీ తల్లికి వందనం పథకం కింద డబ్బులు వస్తాయని ప్రైవేటు యాజమాన్యాలు విస్తృతంగా ప్రచారం చేశాయి.

తల్లిదండ్రులను ప్రలోభాలకు గురిచేసి విద్యార్థులను చేర్చుకున్నాయి. ఈ కారణంగా ప్రభుత్వ స్కూళ్ల నుంచి చాలా మంది టీసీలు తీసుకొని వెళ్లిపోతున్నారని ఉపాధ్యాయులు బాహాటంగానే చెబుతున్నారు. అయితే తల్లికి వందనం పథకం గురించి కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఊసెత్తకపోవడం విశేషం.

### అక్కడ ఫుల్.. ఇక్కడ డల్..!

జిల్లాలోని ప్రైవేటు స్కూళ్లల్లో అడ్మిషన్లు కోలాహలంగా సాగుతున్నాయి. కొన్ని స్కూళ్ల ముందు అయితే 'అన్ని తరగతుల్లో సీట్లు ఫుల్' అయ్యాయని బోర్డులు సైతం పెట్టేశారు. కొన్ని పేరున్న ప్రైవేటు స్కూళ్లలో అయితే సీటు కోసమని రాజకీయ నాయకుల సిఫార్సులు చేస్తేనే కానీ దొరకటం లేదు. ప్రైవేటు స్కూళ్ల మోజు ఎలా ఉన్నా జిల్లాలో కొన్ని ప్రభుత్వ స్కూళ్లకు కూడా గతేడాది వరకు అడ్మిషన్లు బాగానే అయ్యేవి. కానీ ఈ ఏడాది ఎందుకిలా అనేది ఉపాధ్యాయుల్లో తర్జన భర్జన పడుతున్నారు. ప్రభుత్వ స్కూళ్ల పరిరక్షణ కోసమని సోమవారం నుంచి ప్రారంభించిన 'విద్యా ప్రవేశ్' కార్యక్రమంతోనైనా లక్ష్యం మేరకు అడ్మిషన్లు అవుతాయా..? లేదా.? అనేది వేచి చూడాల్సిందే.

## శివుడి అవతారమే శంకరాచార్యులు



ప్రవచిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

**సీతంపేట (విశాఖ):** లలితా నగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం కుర్తాళం శంకరాచార్యులు, పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ప్రవచనం చేశారు. జగద్గురు శంకర విజయంపై స్వామివారు చేసిన ప్రవచనం ఆద్యంతం భక్తులను పరవశులను చేసింది. శంకరాచార్యులు సాక్షాత్ శివుడి అవతారమని, శంకరుల అవతరణ నాటికి భారతావనిలో ధార్మిక వాతావరణాన్ని వివరించారు. సన్యాసాశ్రమ వైశిష్ట్యాన్ని, జప తప హోమాల గురించి తెలియజేశారు. శంకరులు అద్వైత సిద్ధాంతం ప్రచారం ద్వారా దేశంలో జాతీయ సమైక్యతకు దోహదం చేశారని చెప్పారు. శంకరాచార్యులు మహాకవి అని, అపారమైన స్తోత్ర వాంగ్మయం, భక్తి సాహిత్యం సృష్టించారని వారి కవిత్వం, బోధనల ప్రభావం నేటికీ సమాజంపై ఉందని అభిభాషించారు. శంకరుల జీవితంలోని పలు సంఘటనలు, ఉదంతాలను సభారంజకంగా ప్రవచించారు. శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని, అశేష భక్తజనం స్వామి వారి భాషణాన్ని ఆలకించి పులకించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా సీతామాణిక్యం



**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వ విద్యాలయం న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య కె.సీతా మాణిక్యం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆచార్య వి.విజయలక్ష్మి నుంచి ఆమె ప్రిన్సిపాల్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీతామాణిక్యంకు న్యాయ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, విశ్రాంత ఆచార్యులు అభినందనలు తెలిపారు.

## క్లుప్తంగా

### 29న జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశం

**మహారాణిపేట(విశాఖ) :** ఈ నెల 29న జిల్లా పరిషత్ ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు జెడ్పీ ముఖ్య కార్య నిర్వహణ అధికారి (సీఈవో) ఎం.పోలినాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో 29న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఒకటి నుంచి ఏడో స్థాయీ సంఘాల సమావేశాలు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు రెండు, ఐదో స్థాయీ సంఘాల సమావేశాలు, ఉదయం 11 గంటలకు నాలుగు, మూడో స్థాయీ సంఘ సమావేశాలు, అదేవిధంగా మధ్యాహ్నం 12 గంటలకు ఒకటి, ఆరు, ఏడో స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నందున సభ్యులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

### ఏడు బండరాళ్ల లారీలు సీజ్



రాంబిల్లిలో సీజ్ చేసిన బండరాళ్ల లారీలు

**రాంబిల్లి :** మైన్స్ బిల్లులు లేకుండా నేవీకి బండరాళ్లు తరలిస్తున్న ఏడు లారీలను పట్టుకొని సీజ్ చేసినట్టు సీఐ దీనబంధు తెలిపారు. అనకాపల్లి నుంచి రాంబిల్లి నేవీకి బండరాళ్లను తరలిస్తుండగా దాడులు చేశామన్నారు. బిల్లులు లేకుండా బండరాళ్లు తరలిస్తున్న విషయం బయటపడడంతో ఆయా లారీలను సీజ్ చేసి మైన్స్ అధికారులకు అప్పగిస్తున్నామన్నారు.

### కొనసాగుతున్న యోగా శిబిరం

**ఏయూ క్యాంపస్:** కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సీబీసీ) ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని ఏయూ యోగా విలేజ్ ప్రాంగణంలో యోగా శిబిరం కొనసాగుతోంది. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ శిబిరం మంగళవారం ముగియనుంది. ఐదు రోజుల యోగా ప్రదర్శనలో భాగంగా యోగా చిత్ర ప్రదర్శన, వర్చువల్ రియాలిటీ(వీఆర్) సమాచార మాధ్యమాలను వినియోగించి యోగాపై అవగాహన కల్పించారు. ప్రతి రోజు యోగా నిపుణులు నగర ప్రజలకు, సందర్శకులకు యోగా మెలకువలు నేర్పిస్తున్నట్లు సీబీసీ సహాయ సంచాలకుడు మహ్మద్ షఫీ తెలిపారు. సోమవారం ఏయూ పాఠశాలలతో పాటు, నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనను తిలకించారు. ఏయూ పాఠశాల విద్యార్థులు యోగాసనాలు, యోగ క్రియలు చేసి చూపారు. సమాచార, ప్రసార శాఖకు చెందిన కళాకారులు వివిధ కళారూపాలతో ప్రభుత్వ పథకాలు, యోగాపై ప్రదర్శనలు అందించారు.

# అర్జీదారుల సమస్యలకు సత్వర పరిష్కారం

- అధికారులకు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశం
- పబ్లిక్ గ్రీవెన్స్‌కు 161 వినతులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జేసీ జాహ్నవి

**తుమ్మపాల:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులు, ఫిర్యాదులపై తక్షణం స్పందించి, చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన స్పందన కార్యక్రమం పేరు మార్చి, ప్రస్తుత ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పేరిట ప్రారంభించిన ఫిర్యాదుల స్వీకరణ తొలి కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలను, ఫిర్యాదులను జిల్లా అధికారులకు లిఖిత పూర్వకంగా అందించారు. కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, ఇతర జిల్లా అధికారులు ప్రజల వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. అర్జీలకు సత్వర పరిష్కారం చూపేలా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వివిధ విభాగాల్లో పెండింగ్ అర్జీలపై ఆరా తీసి, ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించేలా చొరవ తీసుకోవాలన్నారు. మొత్తం 161 వినతులు వచ్చినట్లు డీఆర్వో తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో మంజులవాణి, డ్వామా పీడీ సందీప్, అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ఈనాం భూములకు పట్టాలివ్వాలి**

కె.కోటపాడు మండలం చౌడువాడ గ్రామంలో రైతులు సాగుచేసుకుంటున్న సర్వీస్ ఈనాం భూములకు రైతుల పేరున రైత్వారీ పట్టాలు మంజూరు చేయాలని రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. చౌడువాడ, పాచిలవానిపాలెం, గరుగుబిల్లి గ్రామాల్లో 66 మంది రైతులు 270 ఎకరాలు సాగు చేసుకుంటున్నట్లు అధికారులు గుర్తించారని, వారికి భూములపై హక్కులు కల్పించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు తెలిపారు.రైతులకు ఎటువంటి పత్రాలు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి సబ్సిడీ విత్తనాలు, ఎరువులు కూడా లభించట్లేదన్నారు. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని అధికారులు భరోసానిచ్చారు.

**పాసుపుస్తకం మంజూరుకు వినతి**

భూమి వివరాలు ఆన్‌లైన్ చేసినప్పటికీ పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయడం లేదంటూ నక్కపల్లి మండలం దోనివానిలక్ష్మీపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు పెద్దాడ కన్నమ్మ విన్నవించుకుంది. గ్రామంలో ప్రభుత్వం ఇచ్చిన డీ పట్టా భూమిలో జీడి పంట సాగుచేసుకుంటున్నామని, తన భర్త మరణించడంతో తన పేరున ఖాతా నెం.1195 భూమిని ఆన్‌లైన్ చేసి పాసుపుస్తకం ఇవ్వలేదని పేర్కొంది.

దీంతో తమకు ప్రభుత్వం ఎలాంటి పథకాలు అందట్లేదని వాపోయింది. బ్యాంక్ రుణం కూడా ఇవ్వట్లేదని, న్యాయం చేయాలని మొరపెట్టుకుంది. దీనిపై సత్వర చర్యలకు సంబంధిత సిబ్బందికి అధికారులు రిఫర్ చేశారు.



సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

**పోలీస్ గ్రీవెన్స్‌కు 22 ఫిర్యాదులు**

**తుమ్మపాల:** శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఆస్తి, కుటుంబ తగాదాలు, చీటింగ్ తదితర ఫిర్యాదులను బాధితుల నుంచి స్వీకరించి, వివరాలు తెలుసుకున్నారు. వాటి ఆధారంగా సంబంధిత అధికారులకు రిఫర్ చేశారు. బాధితులకు చట్ట పరిధిలో త్వరితగతిన న్యాయం చేయాలన్నారు. తమకు అందిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు. మొత్తం 22 ఫిర్యాదులు నమోదయ్యాయి. కార్యక్రమలలో ఎస్బీ డీఎస్పీ బి.అప్పారావు, ఎస్ఐ టి.దివ్య పాల్గొన్నారు.

# చెరువు ఆక్రమణదారుల దౌర్జన్యం

- ఉపాధి పనులు చేస్తున్న కూలీలపై దాడి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు



దేవరాపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసనకు దిగిన తిమిరాం ఉపాధి కూలీలు

**దేవరాపల్లి :** తిమిరాం గ్రామానికి చెందిన చెరువుల్లో పూడిక తీయడానికి వెళ్లిన ఉపాధి కూలీలపై చెరువుల ఆక్రమణదారులు సోమవారం దౌర్జన్యానికి దిగారు. చెరువుల్లో ఆక్రమణలు తొలగించాలంటూ అధికారులకు ఫిర్యాదు చేసిన అదే గ్రామానికి చెందిన రెడ్డి అప్పలనాయుడుతో పాటు ఉపాధి కూలీలను సైతం అడ్డగించి దుర్భాషలాడడంతో తోపులాట జరిగింది. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. తమపై దౌర్జన్యానికి దిగిన వారిపై చర్యలు తీసుకోవాలని అప్పలనాయుడుతో పాటు ఉపాధి కూలీలంతా దేవరాపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చెరువులో పని చేసేందుకు వెళ్లిన తమపై దాడి చేయడంతో పాటు ఒకరిపై చేయి చేసుకున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధిత ఉపాధి కూలీలు తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొద్ది సేపు నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ జి.లక్ష్మీనారాయణ, ఉపాధి హామీ ఏపీవో డి. చంద్రకళ, ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మి తదితరులకు తమ గోడు వెల్లబోసుకున్నారు. కాగా తాము చెరువులు ఆక్రమించామంటున్న భూముల్ని తమ తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్నామని కొందరు రైతులు చెబుతున్నారు. తమ గ్రామ పంచాయతీ పరిధిలో ఆక్రమణలన్నింటినీ తొలగిస్తే, తమ ఆక్రమణలో ఉన్న భూములను స్వచ్ఛందంగా అప్పగిస్తామన్నారు. ఇదే విషయమై తహసీల్దార్ జి.లక్ష్మీనారాయణను వివరణ కోరగా తిమిరాం చెరువుల ఆక్రమణలపై అందిన ఫిర్యాదు మేరకు సర్వే చేయించామని, సరిహద్దులు నిర్ణయించి ఆక్రమణలు ఉంటే తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ స్పష్టం చేశారు.

# క్లాక్ టవర్ పనులు త్వరితగతిన పూర్తి చేయండి



జగదాంబ జంక్షన్లో ఆకర్షిస్తున్న క్లాక్ టవర్, (ఇన్‌సెట్) అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌తో కలిసి క్లాక్ టవర్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- వివిధ అభివృద్ధి పనుల పరిశీలన
- ఇందిరా ప్రియదర్శిని స్టేడియం పనులపై సంతృప్తి

**డాబాగార్డెన్స్ (విశాఖ):** నగర సుందరీకరణలో భాగంగా జగదాంబ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన క్లాక్ టవర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, ఫోకస్ లైటింగ్ ఏర్పాటు చేసి అందంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం జోన్–4 పరిధి జగదాంబ జంక్షన్, ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ సాయికాంత్‌వర్మ మాట్లాడుతూ ఎంతో పేరున్న జగదాంబ జంక్షన్ కూడలిలో అందమైన ఆకృతులతో క్లాక్ టవర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాత్రి వేళల్లో కూడా అందంగా ఉండేటట్టు విద్యుత్ దీపాలు.. అందమైన మొక్కలు ఏర్పాటు చేస్తున్నామని, ఈ పనులు త్వరగా పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజనీరు వినయ్‌కుమార్‌ను ఆదేశించారు. అనంతరం ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంను పరిశీలించారు. గ్యాలరీ పెయింటింగ్ అద్భుతంగా ఉందని కొనియాడారు. స్టేడియంలోలో గుంతలు లేకుండా సమాంతరంగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రాంగణంలో టెన్నిస్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, కరాటే, జిమ్ మొదలైన కోర్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్టేడియం బయట గ్రీనరీ పెంపొందించడంతో పాటు నీడనిచ్చే గ్రాస్ ఏర్పాటు చేయాలని పర్యవేక్షక ఇంజనీరు పీవీవీ సత్యనారాయణరాజును కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. పర్యటనలో జోనల్ కమిషనర్ ప్రసాదరావు, కార్య నిర్వాహక ఇంజనీర్లు సుబ్బారావు, సంతోషి, ఏసీపీ ఝాన్సీ, టీపీవో వినయ్ ప్రసాద్, హార్టీకల్చర్ అధికారి అర్చన తదితరులు పాల్గొన్నారు.

## విద్యా రంగంలో నాణ్యతా ప్రమాణాల పెంపు అవసరం



శిక్షణకు హాజరైన వారితో ఆచార్య కె.రామ్మోహనరావు

**ఏయూ క్యాంపస్:** విద్యా రంగంలో నాణ్యత ప్రమాణాలను నిరంతరం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడు ఆచార్య కె.రామమోహనరావు అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో మదన్‌మోహన్ మాలవ్య మిషన్ టీచర్ ట్రెనింగ్ ప్రోగ్రాంలో భాగంగా నిర్వహిస్తున్న నర్చరింగ్ ఫ్యూచర్ లీడర్‌షిప్ రెండో దశ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నిర్దిష్టమైన నైపుణ్యాలను అధ్యాపక సిబ్బందిలో పెంపొందించాల్సిన ప్రాధాన్యతను వివరించారు. ఎన్ఈపీ 2020లో భాగంగా ఇటువంటి కార్యక్రమాలను రూపకల్పన చేశామన్నారు. కేంద్రియ సంస్థలకు చెందిన మొత్తం 34 మంది సిబ్బంది శిక్షణకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో సంచాలకుడు ఆచార్య అమిత్ బరాన్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి యోగా పోటీల్లో దైవజ్ఞ ప్రతిభ



దైవజ్ఞను అభినందిస్తున్న సెయింట్ జాన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ రూపనంది

**కశింకోట:** స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్‌కి చెందిన 3వ తరగతి విద్యార్థి ఎం.దైవజ్ఞ జిల్లా స్థాయి యోగాసన చాంపియన్‌షిప్–2024లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇటీవల అనకాపల్లిలో జరిగిన ఈ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన చిన్నారిని ప్రిన్సిపాల్ రూపనంది, అకడమిక్ ఇన్‌చార్జి చంద్రమౌళి, ఉపాధ్యాయ సిబ్బంది సోమవారం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభిలషించారు.

## మహిళపై హత్యాయత్నం

**పరవాడ:** కుటుంబ తగాదాల నేపథ్యంలో సత్యనారాయణ అనే వ్యక్తి ఓ మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన దేశపాత్రునిపాలెం శివారు సాయినగర్ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. కంపర సత్యనారాయణ తన కుటుంబంతో దేశపాత్రునిపాలెంలోని సాయినగర్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. సత్యనారాయణ కుమారుడు రమేష్ అదే గ్రామానికి చెందిన మట్ట యశోద కొంత కాలం నుంచి ప్రేమించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో యశోద పెళ్లి చేసుకోవాలని రమేష్‌పై ఒత్తిడి చేస్తుంది. కులాలు వేరు కావడంతో రమేష్ తల్లిదండ్రులు పెళ్లికి అంగీకరించలేదు. దీనిపై యశోద పరవాడ పోలీసులను కూడా ఆశ్రయించింది. పెళ్లి విషయమై కొంత కాలంగా ఇరు వర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం పెళ్లి విషయమై తలెత్తిన వివాదంలో రమేష్ తండ్రి సత్యనారాయణ గర్భవతిగా ఉన్న యశోదపై కొడవలితో దాడి చేశాడు. యశోద మెడ భాగం, చేతిపై గాయాలయ్యాయి. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం గాజువాకలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీబీసీ యోగ చిత్ర ప్రదర్శనకు విశేష స్పందన



ఏయూ స్కూల్లో ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

**మహారాణిపేట(విశాఖ):** కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖకు చెందిన సెంట్రల్ బ్యూర్ ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) విశాఖ సాగరతీరంలో నిర్వహిస్తున్న చిత్ర ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. సోమవారం ఆంధ్రాయూనివర్సిటీ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేకంగా యోగాసనాలు, యోగాక్రియలు, ప్రాణాయమంపై యోగా నిపుణులు హేమ, మల్లిక్‌లు శిక్షణ నిచ్చారు. ఎల్‌సీడీ తెరపై యోగాసానాలు, దేశభక్తి చిత్రాలు ప్రదర్శించడంతో విద్యార్థులు పెద్ద తరలివచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక యోగా విలేజ్ ఆవరణలో ఈ నెల 21 నుంచి 25 వరకూ యోగా చిత్ర ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రోజూ యోగా నిపుణులు సందర్శకులకు యోగా మెలకువలు నేర్పిస్తున్నారు. సమాచార, ప్రసార శాఖకు చెందిన కళాకారులు వివిధ కళారూపాలతో ప్రభుత్వ పథకాలు, యోగాపై ప్రదర్శనలిస్తున్నారు. జబర్దస్త్ ఫేం ప్రకాశ్, డేవిడ్ రాజ్, హేమ కళ ఆధ్వర్యంలో కళ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని సీబీసీ సహాయ సంచాలకుడు షఫీ మహమ్మద్ తెలిపారు.

# లిఫ్ట్ అడిగి.. హత్య చేసేందుకు యత్నం



దాడికి గురైన బాధితుడు ప్రసాద్

**నర్సీపట్నం:** లిఫ్ట్ అడిగాడు. తీరా లిఫ్ట్ ఇచ్చాక, బైక్ ఎక్కి లిఫ్ట్ ఇచ్చిన వ్యక్తినే అంతమొందించేందుకు ప్రయత్నించాడు. బాధితుడు తప్పించుకుని ప్రాణ భయంతో బైక్‌ను వదిలి సమీపంలోని రైతుల వద్దకు పరుగు తీయడంతో నిందితుడు పారిపోయాడు. సోమవారం నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో జరిగిన సంఘటనపై బాధితుడు తెలిపిన వివరాలు. కోటవురట్ల మండలం లింగాపురానికి చెందిన ఒబ్బలరెడ్డి ప్రసాద్ నర్సీపట్నంలోని శ్రీరామ్ ఫైనాన్స్‌లో పనిచేస్తున్నారు. సోమవారం తన స్వగ్రామం నుంచి నర్సీపట్నం వస్తుండగా, యండపల్లి గ్రామం వద్ద అదే గ్రామానికి చెందిన సుర్ల జమీలు అనే యువకుడు లిఫ్ట్ అడిగాడు. ఈయన బజాజ్ షోరూంలో పనిచేస్తుంటాడు. ముఖ పరిచయం ఉండటంతో ప్రసాద్ లిఫ్ట్ ఇచ్చారు. వెనుక కూర్చున్న జమీలు జోగునాథుని పాలెం సమీపంలోకి వచ్చాక తన బైక్ కెల్విన్ స్కూల్ వైపు ఉందని, మెయిన్‌రోడ్డు నుంచి తమ్మయ్యపాలెం వెళ్లే రోడ్లోకి పోనివ్వమన్నాడు. మార్గమధ్యలో జమీలు తన బ్యాగ్ నుంచి సుత్తి తీసి ప్రసాద్ తలపై గట్టిగా కొట్టాడు. ఊహించని పరిణామానికి ప్రసాద్ తలపై చేతులు అడ్డంగా పెట్టి, దెబ్బల్ని కాచుకునేందుకు ప్రయత్నించాడు. దీంతో చేతుల్ని నిందితుడు కొరికాడు. ప్రాణ భయంతో ప్రసాద్ బైక్‌ను వదిలి, కేకలు వేసుకుంటూ దగ్గర్లోని పొలాల్లో ఉన్న రైతుల వద్దకు పరుగులు తీశాడు. వారిని గమనించిన జమీలు పరారయ్యాడు. సంఘటనపై బాధితుడు ప్రసాద్ పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. దాడి వెనుక కారణాలు ఇంకా తెలియరాలేదన్నారు.

## ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

**నర్సీపట్నం:** రాంబిల్లి మండలం, కొత్తపట్నానికి చెందిన వివాహిత చింతకాయల భాగ్యలక్ష్మి నర్సీపట్నంలోని లాడ్జిలో సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సంఘటనకు సంబంధించి టౌన్ ఎస్ఐ సుధాకర్ అందించిన వివరాలు. మృతురాలు బ్రాండిక్స్ కంపెనీలో పనిచేస్తోంది. అదే కంపెనీలో నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లికి చెందిన ఆకుల అజయ్‌కుమార్ పనిచేసేవాడు. ఆ పరిచయంతో వీరి మధ్య కొంత కాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. అజయ్‌కుమార్‌కి కూడా వివాహమయింది. మృతురాలు భాగ్యలక్ష్మి తరచూ నర్సీపట్నం వచ్చి ప్రియుడు అజయ్ కుమార్‌తో గడిపేది. ఎప్పటిలాగే ఇద్దరు ఆదివారం రాత్రి పట్టణంలోని ఓ లాడ్జిలో గడిపారు. ఈ సమయంలో ప్రియుడు నగదు, బంగారం కావాలని డిమాండ్ చేశాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. డబ్బు, బంగారం ఇవ్వనప్పుడు నువ్వు నాకు అవసరం లేదన్న ప్రియుడి మాటలకు మనస్తాపానికి గురైన భాగ్యలక్ష్మి చనిపోతానంది. చనిపోతే చనిపో నీ అవసరం నాకు లేదంటూ ఆమెను నిందితుడు ఆత్మహత్యకు ప్రేరేపించాడు. ప్రియుడు చేసిన ద్రోహాన్ని జీర్ణించుకోలేని భాగ్యలక్ష్మి లాడ్జిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్తకు సుగర్ వ్యాధి కారణంగా ఇటీవల కాలు తొలగించారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడు అజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

## ఆటో, లారీ ఢీకొని ఇద్దరికి గాయాలు

**అనకాపల్లి:** ఎదురెదురుగా వస్తున్న ఆటో, లారీ ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ట్రాఫిక్ ఎస్ఐ సోమశేఖర్ తెలిపిన వివరాలు. మండలంలోని రామాపురంకాలనీలో సోమవారం ఆటో, లారీ ఢీకొన్నాయి. ఆటోలో ప్రయాణిస్తున్న మాడుగుల మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన జి.పార్వతి, ఆటో డ్రైవర్ శ్రీను స్వల్పంగా గాయపడ్డారు. ఆటో డ్రైవర్ శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రైల్వే పోలీసుల అదుపులో గంజాయి నిందితుడు



రైల్వేపోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుడు

**తాటిచెట్లపాలెం(విశాఖ):** విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని సోమవారం గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో, ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో సోమవారం విశాఖ రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా పలు ప్లాట్‌ఫారాలపై తనిఖీలు నిర్వహించారు. హర్యానా రాష్ట్రం, పల్వాల్ జిల్లాకు చెందిన యోగేంద్ర సుమారు రూ.67,500 విలువైన 13.5కేజీల గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గమనించి అదుపులోకి తీసుకొని, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విశాఖ మీదుగా ఢిల్లీకి గంజాయి రవాణా చేస్తున్నట్లు నిందితుడు అంగీకరించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో జీఆర్పీ ఎస్ఐ బాలాజీరావు, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎస్.చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.





## బ్యాగ్‌లు బయట.. భవితవ్యం లోపల.!

జిల్లాలో డిగ్రీ పరీక్షలు జరుగుతున్నాయి. పుస్తకాల బ్యాగ్‌లు పరీక్ష కేంద్రాలకు అనుమతి లేకపోవడంతో విద్యార్థులు ఇలా బయటనే ఉంచేస్తున్నారు. బుల్లయ్య కళాశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు తమ బ్యాగులను ఇలా చెట్లపైనా, ప్రహరీ గోడలపైనా, బైక్‌లపైనా భద్రపరచుకుంటున్నారు.





## క్లుప్తంగా

### తాళ్లపాలెం సంతలో షెడ్‌ల నిర్మాణానికి సన్నాహాలు



తాళ్లపాలెం వారపు సంతలో షెడ్‌లు నిర్మించనున్న ప్రాంతంలో తొలగించిన తాటాకు పాకలు

**కశింకోట:** మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో వ్యాపారులకు షెడ్‌లు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు వ్యాపారులు సొంతంగా తాటి ఆకులతో తాత్కాలికంగా పాకలు నిర్మించుకుని, వాటిలో విక్రయాలు సాగిస్తున్నారు. గాలీ, వాన సమయంలో ఇవి పదేపదే ఎగిరిపోతుండటంతో వ్యాపారులు నష్టపోతున్నారు. దీంతో వారి కోరిక మేరకు నాబార్డు సమకూర్చిన రూ.18.50 లక్షలతో రేకుల షెడ్‌లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే కొంత మేర దుకాణాల తాటాకు పాకలను తొలగించారు.

### కొండ దిగని కూరగాయల ధరలు



తాళ్లపాలెం వారపు సంతలో కూరగాయల విక్రయాలు

**కశింకోట:** మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం కూరగాయల ధరలు బెట్టు మీదే ఉన్నాయి. గత వారంలా మాదిరిగానే కిలో టమాటా రూ.80, ఉల్లిపాయ, బంగాళాదుంప, బెండకాయ, దొండకాయ, చేమదుంప రూ.40కి విక్రయాలు సాగాయి. బీరకాయ రూ.50, వంకాయి, క్యారెట్, బీట్రూట్ రూ.60, క్యాప్సికం రూ.100కు అమ్మకాలు జరిగాయి.

### పైడితల్లమ్మ పండగ నేడు..



పైడితల్లమ్మ అమ్మవారు

**రాంబిల్లి :** మండల కేంద్రంలో మంగళవారం పైడి తల్లమ్మ అమ్మవారి పండగను నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి పండగను పురస్కరించుకొని భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేయనున్నారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| మహారాజ | :రాజా |
| మనమే | :సత్యనారాయణ స్క్రీన్-1 |
| మ్యూజిక్ షాప్ మూర్తి | :సత్యనారాయణ స్క్రీన్-2 |
| భజే వాయు వేగం | :షిర్డిసాయి |
| లవ్ మౌళి | :పర్తిసాయి |
| ఓంభీ(ఓ మంచి ఘోస్ట్) | :వెంకటేశ్వర |
| ప్రభుత్వ జూనియర్ కళాశాల | :శ్రీసత్య |
| హరోం హర | :రామచంద్ర |

### బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 92 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| మొదటి రకం | 5,100 | 5,190 |
| రెండో రకం | 4,030 | 4,540 |
| మూడోరకం | 3,410 | 3,900 |

### రక్త నిల్వలు

**అనకాపల్లి:** ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 56 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-18 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-17 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

**అనకాపల్లి:** ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 382 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 331 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

# గతుకుల రోడ్డుతో తప్పని అవస్థలు



ఎక్కడికక్కడ దెబ్బతిన్న రోడ్డు



గతుకులతో నిండిన కన్నూరుపాలెం-తోటకూరపాలెం రోడ్డు

- గోతులమయం కన్నూరుపాలెం - తోటకూరపాలెం రోడ్డు
- నాలుగు మండలాలకు ఇదే ప్రధాన మార్గం
- రోడ్డు పునరుద్ధరణకు స్థానిక ప్రజల మొర

**కశింకోట:** మండలంలోని కన్నూరుపాలెం-తోటకూరపాలెం రోడ్డు గతుకుల మయంగా మారింది. దీంతో నిత్యం వాహన చోదకులు, ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నారు. దశాబ్దానికి పైగా పరిస్థితి ఇలానే ఉంది. అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్డు బాగుపడక ఇబ్బందులు తప్పట్లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఇదే దగ్గరి మార్గం**

కన్నూరుపాలెం నుంచి తోటకూరపాలెం వరకు ఉన్న 5.3 కిలో మీటర్ల రోడ్డు మార్గాన నిత్యం మండలానికి చెందిన తీడ, చెరకాం, కచ్చాళ్లపాలెం, మేడిశెట్టివానిపాలెం తదితర గ్రామాలతోపాటు రావికమతం, మాకవరపాలెం, బుచ్చెయ్యపేట మండల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రావికమతం వెళ్లేందుకు ఇదే దగ్గరి మార్గం. దీంతో ఈ రోడ్డు మీదుగానే ఎక్కువగా ప్రయాణాలు చేస్తారు. గతంలో పంచాయతీరాజ్ శాఖ నిర్మించిన సిమెంట్, తారు రోడ్లు పదేళ్ల క్రితం భారీ వాహనాల తాకిడికి దెబ్బతిన్నాయి. పెద్ద గోతులతో నిండి, పలుచోట్ల రోడ్డు కోతకు గురైంది. ఈ రోడ్డుపై ఎక్కువగా తిరిగే ఆటోలు, ద్విచక్ర వాహదారులు, ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు.

**వర్షం వస్తే గుబులు**

వర్షం వచ్చిందంటే గోతుల్లో నీరు చేరి రోడ్డేదో.. గోతులేవో కూడా తెలియని పరిస్థితి. గతుకులు కానరాక వాహనాలు దెబ్బతిని తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. గతుకుల్లో పడి వాహనదారులు గాయపడ్డ సంఘటనలూ ఉన్నాయి. గోతుల కారణంతో వర్షం సమయంలో ఆటో డ్రైవర్లు ముందుకు రాకపోవడంతో అత్యవసర సమయంలో గర్భిణులు, రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవట్లేదని ఆక్షేపిస్తున్నారు.

### భయం భయంగా ప్రయాణం



మాకు ఈ రోడ్డు తప్ప వేరే మార్గం లేదు. రోడ్డు గోతులతో నిండి ఎప్పుడు ఏ ప్రమాదానికి గురవ్వాల్సి వస్తుందోనని బిక్కు బిక్కు మంటూ రాకపోకలు సాగిస్తున్నాం. ఒక్కోసారి గోతుల్లో పడి వాహనాలు నడిపేవారు గాయపడుతున్నారు. ఈ రోడ్డు పునరుద్ధరణకు అధికారులు చొరవ చూపాలి.

– మేడిశెట్టి సత్యం, రైతు, తీడ గ్రామం

### తరచూ ఆటోకు రిపేర్లు



రోడ్డుపై కొత్త ఆటోను నడిపినా కొన్నాళ్లకే మరమ్మతులకు గురవుతున్నాయి. ప్రయాణికులు కూడా ఆటోలో వెళ్లేటపుడు వచ్చే కుదుపులకు చాలా ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు ఆటోలు బోల్తాపడ్డాయి కూడా. దీంతో ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. రోడ్డుకు సత్వరమే మరమ్మతులు చేపట్టాలి.

–కోరిబిల్లి అర్జున, ఆటో డ్రైవర్, చెరకాం గ్రామం

### ప్రతిపాదనలు పంపించాం

కన్నూరుపాలెం–తోటకూరపాలెం మధ్య రోడ్డు మరమ్మతులు చేపట్టి, పునరుద్ధరించేందుకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద రూ.3.82 కోట్లతో నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టి, స్థానికుల ఇబ్బందులు తొలగిస్తాం.

–ఎల్.సత్యనారాయణ, డీఈఈ, పంచాయతీరాజ్ శాఖ, అనకాపల్లి

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దందాపై ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా



ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

**అనకాపల్లి:** ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనల ఉల్లంఘనలపై జిల్లా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాలని, విద్యార్థుల ఫీజు వివరాలను పాఠశాల ఆవరణ నోటీస్ బోర్డులో నమోదు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి ఎస్.రమణ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ అనకాపల్లి డివిజన్ పరిధిలో 50 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఆయా యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ఏటా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఫీజుల రూపంలో అడ్డగోలుగా రూ.కోట్లలో వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆక్షేపించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షుడు ఎం.రమేష్, నాయకులు ప్రవీణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రకాశరావు

**అనకాపల్లి:** విద్యార్థి దశ నుంచి ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రకాశరావు విద్యార్థులకు సూచించారు. మండలంలోని ఏఎంఏఎల్ కళాశాల ఆవరణలో అంతర్జాతీయ మాదక ద్రవ్య వినియోగ, రవాణా వ్యతిరేక దినోత్సవంలో భాగంగా సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ చదువుపై ధ్యాస పెట్టడం ద్వారా మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఖాళీ సమయంలో లైఫ్ స్కిల్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులచే మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయబాబు, వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాదే రాజ్యం.. మేమే పాలకులం!

- స్థానిక ప్రజా ప్రతినిధులతో పనిలేదు
- విత్తనాల పంపిణీలో టీడీపీ నాయకుల పెత్తనం
- ప్రొటోకాల్‌కు మంగళం పాడిన అధికారులు



విత్తనాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

**కోటవురట్ల:** టీడీపీ అధికారంలోకి రాగానే అధికారులు ప్రొటోకాల్‌కు మంగళం పాడేశారు. ప్రజాప్రతినిధులు కాని టీడీపీ నాయకులను అందలం ఎక్కిస్తూ ప్రజాస్వామ్యానికి తిలోదకాలు ఇచ్చేశారు. పాలకవర్గ సభ్యులు లేకుండానే ప్రభుత్వ పరమైన కార్యక్రమాన్ని టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఓ పార్టీ కార్యక్రమంలా నిర్వహించేశారు. అధికారుల తీరు సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం విత్తన పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆర్బీకేలో వ్యవసాయాధికారి సరోజిని నిర్వహించగా ఈ కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు ఎవరూ కనిపించలేదు. పైగా టీడీపీ నాయకులు నానా హడావుడి చేసి విత్తనాల పంపిణీ చేశారు. వాస్తవానికి మండలంలో ఎంపీపీ, ఇద్దరు వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ, 16 మంది ఎంపీటీసీలకు గాను 11 మంది ఎంపీటీసీలు వైఎస్సార్ సీపీకి చెందిన వారే. అదేవిధంగా మండలంలోని 25 గ్రామ పంచాయతీలు ఉండగా 22 మంది సర్పంచులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే కాగా స్థానిక సర్పంచ్ కూడా వైఎస్సార్ సీపీ మద్దతుదారుడే. అయినా విత్తన పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ కాని, వైస్ ఎంపీపీలు కాని, జెడ్పీటీసీ కానీ లేకపోవడం శోచనీయం. ప్రజా ప్రతినిధులు ఎవరూ లేకుండానే ప్రభుత్వ కార్యక్రమంతో సంబంధం లేని టీడీపీ నాయకులు హడావుడి చేయడం చర్చనీయాంశంగా మారింది. పైగా ఇందుకు అధికారులు వత్తాసు పలకడం కొసమెరుపు.

## ఆర్‌బీకే ద్వారా రాయితీ విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందజేస్తున్న దృశ్యం

**మునగపాక :** అరబుపాలెం ఆర్‌బీకే ద్వారా రైతులకు సోమవారం రాయితీపై విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్‌బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలని, రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటించి వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధించాలని అన్నారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగించరాదన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు బొడ్డేడ బుజ్జి, శరగడం యోగి నాగేశ్వరరావు, గంగాధర్, వీఏఏ సత్య రవి రాజ్ పాల్గొన్నారు.

## పోలీసులకు 125 స్టాపర్ బోర్డుల అందజేత



రామ్‌కో సిమెంట్ పరిశ్రమ నిర్వాహకులను అభినందిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ



పోలీసులకు రామ్‌కో సిమెంట్ పరిశ్రమ అందించిన స్టాపర్ బోర్డులు

- రామ్‌కో సిమెంట్ ప్రతినిధులను అభినందించిన ఎస్పీ మురళీకృష్ణ

**కశింకోట:** జిల్లాలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ఉపకరించే స్టాపర్ బోర్డులను రామ్‌కో సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం అందించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని ఏఎస్ పేట గ్రామం వద్ద ఉన్న రామ్‌కో పరిశ్రమ సీఎస్సార్ నిధులు రూ.9 లక్షలతో జిల్లా పోలీసులకు 125 స్టాపర్ బోర్డులను సమకూర్చింది. వీటిని జిల్లా ఎస్పీకి సోమవారం పరిశ్రమ యాజమాన్యం తరపున ప్రతినిధులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారి, రాష్ట్ర రహదారుల్లో బ్లాక్ స్పాట్ల వద్ద తరచుగా జరిగే రోడ్డు ప్రమాదాల నివారణకు ఈ స్టాపర్ బోర్డులు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ట్రాఫిక్, రోడ్డు భద్రతను దృష్టిలో పెట్టుకుని స్టాపర్ బోర్డులు అందించినందుకు పరిశ్రమ యాజమాన్యానికి, ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీలు ఎస్.అప్పలరాజు, బి.అప్పారావు(ఎస్బీ), రామ్‌కో సిమెంట్ పరిశ్రమ హెడ్ పి.వీరపాండ్యన్, అడ్మిన్ హెడ్ ఎం.కళాధర్, హెచ్‌ఆర్ ఎం.యువరాజు, అనకాపల్లి ట్రాఫిక్ సీఐ పైడపు నాయుడు, రూరల్ సీఐ ధనుంజయరావు, కశింకోట సీఐ ఎం.వినోద్‌బాబు, అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గానికి అభినందన



బంగారునాయుడును అభినందిస్తున్న గ్రామ పెద్దలు, సొసైటీ డైరెక్టర్లు

**సబ్బవరం:** మండలంలోని ఇరువాడ విశాఖ డెయిరీ పాల సొసైటీ నూతన అధ్యక్షుడిగా మామిడి బంగారునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలోని పాలసొసైటీ వద్ద సోమవారం పాలసొసైటీ అధ్యక్షుడు సంద్రాన అప్పారావు అధ్యక్షతన పాలకవర్గ సభ్యులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో బంగారునాయుడును సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో నూతన అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సంక్షేమం,అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పెదనాయుడుపాలెం పాల సొసైటీ అధ్యక్షుడు సబ్బవరపు సత్యానారాయణ,అమృతపురం వైఎస్సార్‌సీపీ నాయకుడు చీపురుబిల్లి సూర్యనారాయణ,ఇరువాడ గ్రామ పెద్దలు మచ్చ కోటేశ్వరరావుతో పాటు పాల సొసైటీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పాఠశాలలకు ప్రథమ చికిత్స కిట్ల పంపిణీ



దిమిలి హెచ్‌ఎంకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేస్తున్న మన ఊరు మన సేవ సభ్యులు

**రాంబిల్లి:** దిమిలి పరిసర గ్రామాల్లో గల ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలకు దిమిలి మన ఊరు మన సేవ సభ్యులు ప్రథమ చికిత్స కిట్లు అందజేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ డాక్టర్ దేవీ ప్రసాద్ ఈ కిట్లు మన ఊరు మన సేవ సభ్యులకు అందజేయగా, వీటిని పాఠశాలలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొద్దపు మాణిక్యం, బండి గణేష్, బొద్దపు శ్రీను పాల్గొన్నారు.

## విద్యార్థి కిట్ల పంపిణీ

సాక్షి ఎఫెక్ట్..



విద్యార్థులకు అందించిన స్టూడెంట్ కిట్లు

**కశింకోట:** యూనిఫాం కోసం ఎదురు చూడకుండా విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీని విద్యాశాఖ అధికారులు చేపట్టారు. యూనిఫాం వచ్చే వరకు విద్యా కానుక కిట్లను అందించరాదని అధికారులు ముందు నిర్ణయించడంతో 'యూనిఫాం కోసం ఎదురు చూపు'శీర్షికన ఈ నెల 19న సాక్షిలో కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. సాక్షి కథనానికి విద్యా శాఖ అధికారులు స్పందించారు. యూనిఫాం రావడం ఆలస్యం కానుండటంతో, ఇప్పటికే చేరిన స్టూడెంట్ కిట్లను పంపిణీ చేయాలని నిర్ణయించారు. దీంతో కిట్లను సోమవారం విద్యార్థులకు అందించారు. ఇప్పటికే సరఫరా చేసిన మేరకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా స్టూడెంట్ కిట్‌లో భాగంగా బ్యాగ్, బూట్లు, రెండు జతల సాక్షులు, బెల్టు అందించారు. ఇంకా యూనిఫాం మాత్రం అందించాల్సి ఉంది. మండలంలోని 57 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 95 శాతం మేర కిట్లను పంపిణీ చేసినట్లు ఎంఈవో-2 కేఎస్ఎస్ మూర్తి తెలిపారు. యూనిఫారం రావడంలో జాప్యం నెలకొన్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కిట్ల పంపిణీ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. యూనిఫారం వచ్చిన వెంటనే నిబంధనల మేరకు వాటిని విద్యార్థులు అందిస్తామన్నారు.

## రూ.2 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



ఇందిరానగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు

**అనకాపల్లి:** రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్లు తుమ్మపాల గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు తెలిపారు. మండలంలోని తుమ్మపాల గ్రామంలో రూ.2 లక్షలతో ఇందిరానగర్ సీసీ రోడ్డు నిర్మాణ పనుల్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగియడంతో పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. రహదారి నిర్మాణ పనులు జరిగే ప్రదేశాల్లో ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో అన్నపూర్ణ బ్యాంక్ మాజీ చైర్మన్ పీలా గాంధీ, ఎంపీటీసీలు వద్దాది భారతిఅశోక్, పన్నీరు వెంకటలక్ష్మీచంటి, వార్డు మెంబర్లు ముత్యాల వెంకటలక్ష్మి, గోవిందమ్మ, తర్ర సత్యారావు, అండిబోయిన నాగరాజు, దళిత నాయకుడు బంగారు వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు ముత్యాల అప్పారావు, కందిపూడి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రమైన తాగునీటి సరఫరాకు చర్యలు



చిన్నసంపతిపురంలో వాటర్ ట్యాంక్ నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో మోహన్‌కుమార్

**అనకాపల్లి:** వర్షాకాలంలో గ్రామాల్లో ప్రజలు డయేరియా వ్యాధిన పడకుండా, పరిశుభ్రమైన తాగునీరు సరఫరా చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో పీవీఎం మోహన్‌కుమార్ తెలిపారు. మండలంలోని చిన్నసంపతిపురం వాటర్ ట్యాంక్‌లో నీటి సాంద్రతను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 69 తాగునీటి ట్యాంక్‌లు ఉన్నాయని, దశల వారీగా తనిఖీలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. వారానికి ఒకసారి ట్యాంక్‌ను శుభ్రం చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ట్యాంక్ నుంచి గ్రామాలకు తాగునీటిని అందించే పైప్‌లైన్లకు లీకేజీలు లేకుండా, ఉన్నా తక్షణం మరమ్మతులు చేపట్టేలా క్షేత్ర స్థాయి సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట మండల తాగునీటి విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల ఆందోళనకు విరామం



పారిశుధ్య కార్మికుల సమస్యలపై చర్చలు జరుపుతున్న పంచాయతీ కార్యదర్శి రమేష్

**కశింకోట:** స్థానిక పంచాయతీ పరిధిలో పనిచేసే పారిశుధ్య కార్మికుల ఆందోళన కార్యక్రమం సోమవారం తాత్కాలికంగా వాయిదా పడింది. గత మూడు రోజులుగా తమకు రావలసిన వేతన బకాయిల కోసం విధులను బహిష్కరించి ధర్నాలు, ర్యాలీలతో నిరసన తెలుపున్న విషయం తెలిసిందే. పంచాయతీ కార్యదర్శి రమేష్, కూటమి ప్రతినిధులు, సీఐటీయూ నాయకులు సమస్య పరిష్కారానికి పారిశుధ్య కార్మికులతో చర్చించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 27న రెండు నెలల వేతన బకాయిలు చెల్లించేందుకు, మిగిలిన మూడు నెలల బకాయిల్ని రెండు మాసాల్లోగా చెల్లించేందుకు హామీ ఇచ్చారు. దీంతో పారిశుధ్య కార్మికులు సమ్మెను తాత్కాలికంగా విరమించారు. పంచాయతీ కార్యదర్శి ఆదేశాల మేరకు విధులకు హాజరై చెత్త తొలగింపు పనులు చేపట్టారు. ఈ చర్చల్లో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఏపీ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) స్థానిక అధ్యక్షుడు కె.రామంజి, కార్యదర్శి జి.వెంకటరమణ, కోశాధికారి కె.దేముడు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలోనే గుర్తిస్తే 'సికిల్ సెల్' నియంత్రణ సులభం



సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌వో శారద

**అనకాపల్లి:** సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి వంశపారంపర్యంగా సంక్రమిస్తుందని, వ్యాధిని మొదటి దశలో గుర్తించినట్లయితే ఆరోగ్యంగా జీవించవచ్చని తుమ్మపాల వైద్యాలయం సీహెచ్‌వో డి.శారద అన్నారు. మండలంలోని తుమ్మపాల సచివాలయం-2 పరిధిలో సికిల్ సెల్ ఎనీమియా, మలేరియా వ్యతిరేక మాసోత్సవం పురస్కరించుకుని ఏఎన్ఎంలు, ఆశ వర్కర్స్ సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా లక్షణాలు లేకపోయినా క్రమం తప్పకుండా స్పెషలిస్ట్ వైద్యులు, వైద్య సిబ్బంది సలహా మేరకు రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. శరీరంలో తగినంత నీటి శాతాన్ని పాటించాలన్నారు. వైద్యుల సలహాలు మేరకు సకాలంలో మందులు, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. సికిల్ సెల్ ఎనీమియా అంటువ్యాధి కాదన్నారు. జూన్ 1న ప్రారంభమైన మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు నెలాఖరు వరకు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌పీహెచ్ ప్రియదర్శిని ఏఎన్ఎం జయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ ఈశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో బస్ షెల్టర్



**పరవాడ:** మండలంలోని కలపాకలో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్ షెల్టర్ నేడో రేపో కూలడానికి సిద్ధంగా ఉంది. ఈ షెల్టర్ ఆలనా పాలన చూసే నాధుడు లేక శిథిలావస్థకు చేరింది. దీంతో గ్రామం నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులకు నిరీక్షించడానికి నీడ లేక అవస్థలు పడుతున్నారు. బస్సులు, ఆటోల కోసం వచ్చే ప్రయాణికులు షెల్టర్‌లో కూర్చోవడానికి భయపడుతున్నారు. ఎండైనా వానైనా ఆరుబయట వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రయాణికులు వాపోతున్నారు. శిథిలమైన బస్ షెల్టరును తొలగించి ఆ స్థానంలో నూతన బస్ షెల్టరు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.